క్లుప్తంగా

70 మందికి ఉచిత గుండె పరీక్షలు



తోట్లవల్లూరు: మండల కేంద్రంలో గురువారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ (విజయవాడ) ఆధ్వర్యాన ఉమా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో నిర్వహించిన శిబిరంలో ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ పి.విశ్వనాథ్ 70 మందికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూచనలు చేయటంతోపాటు మందులు పంపిణీ చేశారు. తమ్మన ఉమామహేశ్వరరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో పోలీసుల మార్చ్‌ఫాస్ట్



గుడివాడరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ తెలిపారు. పట్టణంలోని ఏలూరురోడ్డు, నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా కేంద్ర బలగాలతో గురువారం ఆయన మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా పోలీసులు, కేంద్ర బలగాలతో కలసి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

వృద్ధులు, మహిళలకు ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు



గుడివాడరూరల్: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు చేశామని ఎస్ఐ ఎన్.చంటిబాబు గురువారం తెలిపారు. స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, మహిళల పట్ల సిబ్బంది మర్యాదగా మెలిగి వారి సమస్యలను ప్రత్యేక దృష్టితో చూసి త్వరితగతిన పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. స్టేషన్‌కు వచ్చే వారికి వీలైనంత త్వరగా న్యాయం చేస్తామన్నారు.

ఘనంగా కైలే జన్మదిన వేడుకలు



పామర్రు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ జన్మదినోత్సవ వేడుకలను స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పామర్రు -3 ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన వేడుకలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, తిరుమలశెట్టి వాసు, పెయ్యల రాజులు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: వీరంకిలాకు ఇరిగేషన్ బంగ్లా ఆవరణలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మాజీ ఎంపీపీ కొంటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: కైలే అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలు మండలంలోని వల్లూరుపాలెంలో జరిగాయి. పార్టీ జిల్లా నాయకుడు చింతలపూడి గవాస్కర్‌రాజు ఆధ్వర్యాన చేశారు.

దుకాణదారులకు అవగాహన

గుడ్లవల్లేరు: చికెన్ దుకాణ యజమానులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే బర్డ్‌ఫ్లూ మహమ్మారి బారిన పడటం ఖాయమని గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన గుడ్లవల్లేరులోని చికెన్ దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ వ్యాధి ఉన్న ప్రాంతాల నుంచి కోళ్లు, గుడ్లను దిగుమతి చేసుకోకూడదని దుకాణదారులను ఆయన హెచ్చరించారు.

నత్తనడకన పనులు

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఐక్య వేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, అప్పారావు, వెంకటేశ్వరరావు తెలిపారు. 45 రోజుల క్రితం రెండు మూడు మీటర్ల లోతులో మట్టిని తవ్వి నేటికీ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు.

సగానికి దిగజారిన గుడ్డు వినియోగం!

- జిల్లాలో గతంలో నిత్యం వాడకం 20 లక్షల పైమాటే
- కానీ బర్డ్‌ఫ్లూ భయంతో 10 లక్షలకు పడిపోయిన వైనం

గుడ్లవల్లేరు: కోడిగుడ్డు వాడకాలు సగానికి పడిపోయాయి. జిల్లాలో నిత్యం కోడిగుడ్ల వినియోగం 20 లక్షల పైమాటే ఉండేది. కానీ బర్డ్‌ఫ్లూతో 10 లక్షలకు వాడకాలు పడిపోయాయి. గతంలో రిటైల్‌లో గుడ్డు ధర రూ.7 ఉండేది. అదే కోడిగుడ్డు ధర రూ.4.30కు పడిపోయింది. బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్‌తో పాటు కోడిగుడ్లను తినకూడదన్న ప్రచారం బాగా కొనసాగుతుంది. దీంతో గుడ్డుకు ఉండే మాత్రం డిమాండ్ తగ్గిపోయింది. జిల్లాలో నిత్యం ఈ కోడిగుడ్ల వినియోగం 20లక్షల పైమాటే ఎప్పుడూ ఉంటుంది. గతంలో ఒక్కో కోడి గుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 ఉండేది. అది కాస్తా....రూ.7కు పెరిగిపోయింది. ఇప్పుడైతే బర్డ్‌ఫ్లూతో రూ.4.50కు దిగజారింది. 30 గుడ్లు ఉండే ఒక్కో ట్రే గుడ్లను ప్రాంతాలను బట్టి రూ.135 నుంచి రూ.15 0వరకు మార్కెట్లో వ్యాపారులు అమ్ముతున్నారు.

బర్డ్‌ఫ్లూ భయంతో....

బర్డ్‌ఫ్లూతో జిల్లాలో కోడిగుడ్ల వాడకం 10 లక్షలకు పడిపోయింది. తిరువూరు, గంపలగూడెంలో బర్డ్‌ఫ్లూ కలకలంతో మరింత ఆందోళన అధికమైంది. గతంలో జిల్లాలో గుడ్ల వాడకం 20 లక్షల పైమాటే ఉండేది. జిల్లాలోని ప్రజలతో పాటు హాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్ల వినియోగం కూడా బర్డ్‌ఫ్లూతో తగ్గిపోయింది. అలాగే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో వాడకం కూడా నానాటికీ దిగజారిపోతుంది. వీటిలో గుడ్ల వాడకం గతంలో ప్రతి స్నాక్స్ కోటింగ్‌కు వినియోగించటంతో పాటు ఫ్రైడ్‌రైస్ తయారు చేసే ఆ చెఫ్‌కు ఎగ్స్ లేకుండా వంట అనేది ముందుకు వెళ్లేదే కాదు. కానీ ఇపుడు చికెన్‌తో పాటు గుడ్డు లేకుండా ఉన్న స్నాక్స్, ఫుడ్ ఐటమ్స్‌నే కస్టమర్స్ ఎక్కువగా అడుగుతున్నారని ఆ రెస్టారెంట్ల యజమానులు చెబుతున్నారు. గుడ్డుకు ఇలాగే డిమాండ్ తగ్గితే ఇపుడు ఒక్కో గుడ్డు రూ.4.50 ఉండటంతో ఆగిపోకుండా మరింతగా దిగజారిపోయే అవకాశం ఉందని వ్యాపారులు సతమతమవుతున్నారు.



ట్రేలలో కోడిగుడ్లు

గుడ్డు హ్యాపీగా తినవచ్చు



బర్డ్‌ఫ్లూ ఉన్న ప్రాంతాల్లో తప్ప గుడ్డును నిత్యం ఎలా ఆరోగ్యానికి వినియోగిస్తారో...అలాగే తినవచ్చు. కానీ ఆరగ్యోం కోసం పచ్చి గుడ్లను తాగే వాళ్లు కొన్నాళ్లు ఆ అలవాటుకు అడ్డు కట్ట వేయాలి. బర్డ్‌ఫ్లూ ప్రభావం తగ్గేంత వరకు కొన్ని జాగ్రత్తలతో గుడ్లను తింటే ఆరోగ్యానికి మంచిది. సగం ఉడికించిన (హాఫ్ బాయిల్డ్) గానీ, సరిగా ఉడకని ఆమ్లెట్ గానీ తినకూడదు. చలికాలంలో గుడ్లను తినటంతో శరీరానికి ఎక్కువగా వెచ్చదనం వస్తోంది.

– డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ, వెటర్నరీ ఏడీ గుడ్లవల్లేరు

నిష్ణాతులైన మహిళలకు సన్మానం



మహిళలను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు



క్రీడాకారులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు



లక్ష్మీ సుజాతను సన్మానించిన ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు

పామర్రు: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక హితమ్ స్కూల్ ఆవరణలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని తెలిపారు. పలు రంగాలలో నిష్ణాతులైన ఏడుగురు మహిళలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య, అల్లాడి సోమశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా క్రీడాకారులను గురువారం సత్కరించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన టి. ఉష, ఎస్‌ఎస్ అను, జి. లోహితశ్రీ, పి. అనంత సత్యదుర్గ, జి. సుభాషిణి, గోపికలను సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలకు పూర్తి సేచ్ఛ ఇచ్చినప్పుడు వారు ఎంతో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె. రామారావు, కార్యదర్శి డి. శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్. రామకృష్ణ, సభ్యులు ఎల్ఈ వెంకటేశ్వరరావు, ఎం. శివరామకృష్ణ, కె. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు

గుడ్లవల్లేరు: ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతూ...తమ సామర్థ్యాన్ని సమాజానికి చాటుతున్నారని జేసీఆర్‌టీ మాజీ ప్రెసిడెంట్ టి.లక్ష్మీ సుజాత అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని దేశమంతటా నిర్వహిస్తారని చెప్పారు. శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ధైర్యంతో విద్యార్థినులు మెలగాలని తెలిపారు. విద్యతో పాటు అలవరచుకున్న క్రమశిక్షణ రేపటి భవిష్యత్తుకు పునాదిగా నిలబడుతుందన్నారు. ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



మండవల్లి: భీమవరం నుంచి మచిలీపట్నం వెళుతున్న కారు కానుకొల్లు వద్ద గేదె అడ్డం రావడంతో అదుపు తప్పి పోల్రాజు కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరున్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికుల సహాయంతో కారును బయటికి తీశారు.

రేపు గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ 44వ వార్షిక వేడుకలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ 44వ వార్షిక వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జి.వి. రామచంద్రరావు విచ్చేయనున్నారని చెప్పారు.

15న ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన

కైకలూరు: నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఇన్‌హాన్స్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) స్వయం అనే ఆన్‌లైన్ కోర్సులపై వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 15న మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా జాతీయ అవగాహన కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.శ్రీలత గురువారం చెప్పారు. ఇటీవల మద్రాసు ఐఐటీతో ఎన్‌పీటీఈఎల్ కోర్సులకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాయితీలు అందిస్తారన్నారు. ముఖ్య వక్తలుగా గౌహతీ, హైదరాబాదు, గీతం యూనివర్సిటీ, విశాఖపట్నం ప్రొఫెసర్లు కోర్సు వివరాలు చెబుతారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

బర్డ్‌ఫ్లూ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెదపారుపూడి: బర్డ్‌ఫ్లూ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తున్న తరుణంలో కోళ్ల ఫారాల యజమానులు, కోడిమాంసం, గుడ్లు విక్రయదారులు తగు జగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మీ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బర్డ్‌ఫ్లూ నియంత్రణపై పశువైద్యులు, చికెన్ షాపుల నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రసుత్తం బర్డ్‌ఫ్లూ వ్యాప్తిస్తుండటంతో ఎన్‌టీఆర్ జిల్లా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కోళ్లు, గుడ్లు కొనుగోలు చేయవద్దని సూచించారు. షాపుల వద్ద కచ్చితంగా శానిటేషన్ చేయించాలని సూచించారు. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి రవాణాపై చెక్‌పోస్టులు పెట్టామన్నారు. తక్కువ ధరకు వస్తున్నాయనే ఆలోచనతో కొనుగోలు జరిపితే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పశువైద్యులు జయంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **సత్యదేవుని ఆశీస్సులతో అభివృద్ధి చెందాలి**



గుడ్లవల్లేరు: సత్యదేవుని ఆశీస్సులతో గుడ్లవల్లేరు ప్రాంతం అభివృద్ధి చెందాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి 72వ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, ధర్మకర్తలు కొప్పురావూరి రవీంద్ర, మురాల నరేష్, కాగితం హరికృష్ణ, చిలంకుర్తి వెంకటేశ్వరరావు, కోడె శారద, బలే కల్పన తదితరులు పాల్గొన్నారు.

- **లక్ష్మణరావును గెలిపించండి**

ముదినేపల్లి రూరల్: ఉభయ కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సీఐటీయు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. కేఎస్ తరపున స్థానిక రామాలయం వద్ద సంఘాల నాయకులు గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పీడీఎఫ్ సభ్యులకు మాత్రమే ఉంటుందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటు పడే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో లక్ష్మణరావును గెలిపించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సంఘాలు బలపరిచిన లక్ష్మణరావుతో మాత్రమే ప్రజా సంక్షేమం సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిన్నం మాధవ, సీఐటీయూ నాయకుడు జక్కుల మహేష్ మాట్లాడారు.

- **21 మద్యం బాటిళ్ల స్వాధీనం**

కైకలూరు: నియోజకవర్గంలో బెల్టు దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ కైకలూరు సీఐ ఎస్‌కే రమేష్ హెచ్చరించారు. నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో గురువారం తనిఖీలు చేయగా మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న కైకలూరు మండలం గుమ్మళ్లపాడుకు చెందిన నబిగారి మహారాజు నుంచి 9, మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామానికి చెందిన బలే వీరుళ్ల నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై పి.ఆదినారాయణ, హెడ్‌కానిస్టేబుల్ కుటుంబరావు, కానిస్టేబుల్ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- **ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు**



గుడ్లవల్లేరు : రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి 72వ బ్రహ్మోత్సవాలు స్వామివారి పవళింపు సేవతో వైభవోపేతంగా ముగిశాయి. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితుడు రొంపిచర్ల శ్రీనివాసాచార్యుల బృందం వేద మంత్రోచ్ఛరణ నడుమ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కొప్పురావూరి రవీంద్ర, మురాల నరేష్, కాగితం హరికృష్ణ, చిలంకుర్తి వెంకటేశ్వరరావు, కోడె శారద, బలే కల్పన తదితరులు పాల్గొన్నారు.

- **హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ**



కైకలూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని రూరల్ ఎస్సై వి.రాంబాబు చెప్పారు. ఆలపాడు శివారు ఉప్పుటేరు వద్ద ప్రయాణికులకు హెల్మెట్లపై అవగాహన గురువారం కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా తలకు దెబ్బ తగలడం వలన మరణాలు సంభవిస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- **రహదారి విస్తరణ పనుల ప్రారంభం**

ముదినేపల్లి రూరల్: పామర్రు–దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లి సెంటర్‌లో పునఃప్రారంభమయ్యాయి. గతేడాది ఈ పనులను నిలిపి వేయగా ప్రస్తుతం రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. స్థానిక అంబేడ్కర్ నగర్ కాలనీ వద్ద యంత్రాలతో పనులు చేస్తున్నారు. ముదినేపల్లి గ్రామం వెలుపల రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి కాగా ప్రధాన సెంటర్‌లో అసంపూర్తిగా నిలిచాయి. సెంటర్‌లో డ్రైన్ల నిర్మాణం అసంపూర్తిగా చేసి వదిలివేయడంతో రోడ్డుకి ఇరువైపులా ఉండే వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల కిందట నిలిచిపోయిన ఈ పనులు తిరిగి ప్రారంభం కావడంతో ఈ సారైన పూర్తి స్థాయిలో పనులు చేస్తారా లేదా అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణ పనులు మే నెలాఖరులోపు పూర్తి చేస్తామని చెప్పారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు: ఈ నెల 26న జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి సూచించారు. మండలంలోని ఐలూరులో గల శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఐలూరు క్షేత్రానికి ఉన్న విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కృష్ణానదిలో భక్తుల స్నానాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే ఆలయం వద్ద కూడా భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవదాయ శాఖ ఫెస్టివల్ అధికారి అనూరాధ, ఎస్ఐ అవినాష్, ఆలయ ఈఓ శివగోపాల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వీఆర్ఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఐలూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుసుమకుమారి

చికెన్ విక్రయాలు నిలిపి వేయాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో చికెన్, కోడిగుడ్ల విక్రయాలను అధికారులు వెంటనే నిలిపి వేయాలని పలువురు సర్పంచులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ జేఎస్ సుభానీకి గురువారం ఫిర్యాదు చేశారు. బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఉభయగోదావరి జిల్లాల్లో వేలాదిగా కోళ్లు మృత్యువాత పడుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు గుడ్లు ఇవ్వడం వలన అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొన్నిరోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వీటి విక్రయాలను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా గురుకుల కళాశాల వార్షికోత్సవం

నిమ్మకూరు(పామర్రు): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అప్పుడే ఉన్నతులుగా ఎదుగుతారని గుంటూరు ప్రత్యూష కౌన్సెలింగ్, హెచ్ఆర్‌డీ సెంటర్ సైకాలజిస్టు డాక్టరు ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. మండల పరిధి నిమ్మకూరులోని ఎస్ఎల్‌వీఆర్‌జీఎస్ఆర్‌వీ జూనియర్ కళాశాల 38వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న విద్యార్థులు అందరూ కష్ట పడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు పి.సుజనా ప్రియ, నిమ్మకూరు ఏపీఆర్ఎస్ ప్రిన్సిపల్ కె.గ్రేసీ సుభానీ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఖో-ఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జమీగొల్వేపల్లి(పామర్రు): సెంట్రల్ జోన్ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని జమీగొల్వేపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి.ఉషారాణి తెలిపారు. విజేతలైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో గవర్నమెంట్ హైస్కూల్ అవనిగడ్డలో జరిగిన 68వ కృష్ణా జిల్లా సెకండరీ స్కూల్ గ్రిగ్ మెమోరియల్ బాలికల సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని తెలిపారు. ఖో-ఖో జూనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఖో-ఖో సీనియర్స్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. సీనియర్ విభాగంలో కె. ఊర్వ, జూనియర్స్ విభాగంలో కె.రేష్మశ్రీ కి ఉత్తమ క్రీడాకారుల అవార్డులు అందజేశారని తెలిపారు. విద్యార్థినులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన నాలి రవిబాబును హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



ఖో-ఖో జూనియర్ బాలికల జట్టుని అభినందిస్తున్న హెచ్ఎం ఉషారాణి

10కే రన్‌కు సహకరించాలని వినతి

గుడివాడ టౌన్: ఈ నెల 16వ తేదీ నిర్వహించనున్న 10కే రన్‌కు పోలీస్ శాఖ సహకరించాలని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు కోరారు. స్టేడియం కార్యాలయంలో వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు, ఎస్ఐలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్టేడియంలో ఈ రన్ ప్రారంభమవుతుందని తెలిపారు. అప్పటి నుంచి విజేతలైన క్రీడాకారులు తిరిగి స్టేడియంకు వచ్చే వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి పూర్తిగా సహకరిస్తామని స్టేడియం కమిటీకి పోలీసు అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్, పాలకవర్గ సభ్యులు డి. రవికుమార్, వి. వరప్రసాద్, ఎ. శ్రీనివాసరావు, పి. వంశీకృష్ణ, సిఐలు కె. శ్రీనివాస్, సీహెచ్. నాగప్రసాద్, ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో సమీక్ష నిర్వహిస్తున్న యలవర్తి శ్రీనివాసరావు

అంగన్‌వాడీలకు శిక్షణ

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల హైస్కూల్‌లో గురువారం పోషణభీ పడాయిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఐసీడీఎస్ వెంట్రప్రగడ, పెదపారుపూడి సూపర్‌వైజర్‌లు ఎం. శివనాగమణి, అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై దృష్టి సారించటంతో పాటు ప్రీస్కూల్ నాణత్యను మెరుగుపరచాలన్నా ఉద్దేశంతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణలో చెప్పిన విషయాలను నేర్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలయ్యేలా చూడాలన్నారు. పిల్లలు పుట్టిన నాటి నుంచే వారిని గమనిస్తూ ఉన్నత స్థాయిలో ఎదగడానికి కృషి చేయాలని వివరించారు.

- **వృద్ధులకు పండ్లు పంపిణీ**

పామర్రు: నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కైలేఅనిల్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మచిలీపట్నంరోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలు పి.రత్నకుమారి, కె.రాజ్యలక్ష్మీ, కుందేటి రాణి, గొల్వేపల్లి గ్రామ సర్పంచ్ శాంతకుమారి, అభిమానులు పాల్గొన్నారు.

డాక్స్‌మెంట్స్ పోయినవి

మండవ రోజా W/o అట్లూరి వెంకట సమీర్, (D/o (లేటు) మండవ వెంకటేశ్వరరావు) డి.నెం. 3-103, మొవ్వ గ్రామం & మండలం, కృష్ణాజిల్లా వారికి చెందిన మొవ్వ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన 1) దస్తావేజు నెం, 1969/1988, సర్వేనెం. 614/1 య. 0.50 సెంట్లు, 2) దస్తావేజు నెం. 2665/2020, సర్వేనెం: 615/1ఏ య 0.42 సెంట్లు, సర్వేనెం: 615/1బి య 0.08 సెంట్లు వెరశి య 0.50 సెంట్లు, 3) దస్తావేజు నెం: 1520/1993, సర్వేనెం. 618/2 య 0.622 సెంట్లు 4) దస్తావేజు నెం: 517/1998, సర్వేనెం: 614/3 య 0.56 సెంట్లు, 5) దస్తావేజు నెం. 626/2008 సర్వేనెం: 614/2 య 0.97 సెంట్లు, సర్వేనెం: 615/1సి య1.23 సెంట్లు వెరశి య 2.20 సెంట్లు 6) దస్తావేజు నెం: 627/2008, సర్వేనెం: 614/3 య 0.40 7) దస్తావేజు నెం: 776/2008, సర్వేనెం: 616/5 య 1.80 సెంట్లు సర్వే నెం. 618/1బి య 0.59 సెంట్లు వెరశి 2.39 సెంట్లు కు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దొరికినవారు దయచేసి పై అడ్రస్సును సంప్రదించగలరు.